ప్రజాశక్తి

శనివారం 2 ఆగస్టు 2025

5

పార్వతీపురం మన్యం

నేడు సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమరోహ్

పార్వతీపురం : సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమరోహ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్టు ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీతి ఆయోగ్ కింద అశావాహ జిల్లాల్లో పార్వతీపురం మన్యం జిల్లా ఒకటిగా ఉందన్నారు. ఇందులో భాగంగా విద్య, ఆరోగ్యం, పోషకాహారం, జీవనోపాధి, మౌలిక సదుపాయాలు వంటి 12 కీలక సామాజిక రంగ సూచికలలో ఆయా రంగాల్లో పర్యవేక్షిస్తుందని చెప్పారు. ఆశావాహ జిల్లాలు, బ్లాక్‌ల్లో సూచికల్లో శత శాతం సంతృప్తిని సాధించే లక్ష్యంతో నీతిఆయోగ్ "సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమరోహ్"ను ప్రారంభించిందన్నారు. ఈ మేరకు నీతి ఆయోగ్ సూచనల అనుగుణంగా శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వాస్తవాలకు ప్రతిబింబం ప్రజాశక్తి

- వార్షికోత్సవ సభలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ అంబేద్కర్
- ఘనంగా 45వ వార్షికోత్సవం.. ప్రత్యేక సంచిక ఆవిష్కరణ
- రక్తదానానికి విశేష స్పందన

'ప్రజాశక్తి' వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, అతిథులు; సభలో మాట్లాడుతున్న విజయనగరం జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వాస్తవాలకు ప్రతిబింబంగా నిలుస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతూ 45 ఏళ్లగా ప్రజాశక్తి ముందుకు సాగడం అభినందనీయమనిరాష్ట్ర చిన్న మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ప్రజాశక్తి 45వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిథులుగా మంత్రి శ్రీనివాస్, కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, డిపిఆర్ఒ ఎం.మల్లేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ పాల్గొన్నారు. ముందుగా ప్రజాశక్తి వ్యవస్థాపకులు మోటూరు హనుమంతురావు, కొరటాల సత్యన్నారాయణ చిత్రపటాలకు మంత్రి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ కె.రమేష్ నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో అతిథులంతా కలిసి ప్రజాశక్తి వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో వాస్తవాలను వెలుగులోకి తెచ్చే పత్రిక ప్రజాశక్తి అని, అందుకే ఆ పత్రికను ప్రజలంతా ఆదరిస్తారని అన్నారు. 45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై వార్తలు రాస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉండటం అభినందనీయ మన్నారు. ప్రజాప్రతినిధిగా అభివృద్ధి, సంక్షేమం వైపు దృష్టి సారిస్తున్నప్పుడు తమ దృష్టికి వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చిన పత్రిక ప్రజాశక్తి అన్నారు. జిల్లాలో ప్రజాశక్తిలో వస్తున్న కథనాలను, వార్తలను ప్రజలు అభినందిస్తున్నా రన్నారు. ఈ పత్రిక సిబ్బంది అంకిత భావం, స్ఫూర్తితో పనిచేయడం గొప్ప విషయమన్నారు. ప్రజాప్రతినిధులకు వాస్తవ విషయాలను తెలియజేసినపుడే వాటిని పరిష్కారం చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. మరిన్ని వాస్తవాలు, ప్రజా సమస్యలను కథనాలు ద్వారా తెలియజేయాలని కోరారు. కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విలువలకు కట్టుబడి 45 ఏళ్లుగా ప్రయాణించడం చిన్న విషయం కాదన్నారు. ప్రజా సమస్యలను వెలికితీస్తూ వాటి పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొస్తూ ప్రజాశక్తి ముందుకు సాగుతోందన్నారు. ఇదే స్ఫూర్తితో కొనసాగాలని ఆకాంక్షించారు. సమాచార శాఖ పౌర సంబంధాలశాఖ అధికారి ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై నికార్సుగా వార్తలు రాస్తూ బడుగు బలహీన వర్గాల వేదికగా ప్రజాశక్తి ఉందన్నారు. ప్రజాశక్తి ద్వారా ప్రజల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. మారుతున్న కాలానుగుణంగా మొబైల్ యాప్ ద్వారా కూడా వార్తలు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు.

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రజాశక్తి ప్రతి అక్షరం ప్రజలు పక్షం అనే లక్ష్యంతో పని చేస్తుందన్నారు. అనేక ఇబ్బందులను ఎదుర్కొని కష్టజీవుల పత్రికగా ఉన్న ఏకైక పత్రిక అని కొనియాడారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయి, వాటి వల్ల కలిగే నష్టాలు, ప్రయోజనాలను ప్రజాశక్తి వివరిస్తుందన్నారు. కార్మిక, పేద వర్గాల కోసం, దోపిడీలేని సమాజం కోసం పని చేస్తున్న కష్టజీవుల పత్రిక అని అన్నారు. నిజం తెలుసుకోవాలంటే ప్రజాశక్తి ద్వారానే సాధ్యమవుతుందన్నారు. అలాంటి పత్రిక అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు.

ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రజాశక్తి అంటే వ్యాపారం కోసం కాదని, సేవా భావంతో పని చేస్తున్నది అనడానికి నేడు నిర్వహించిన రక్త దాన శిబిరమే ఉదాహరణ అని అన్నారు. కుటుంబ పెద్ద 45 ఏళ్లలో ఎటువంటి బాధ్యత మోస్తారో అదే విధంగా ప్రజాశక్తి జిల్లా, రాష్ట్రం, దేశం బాగుండాలని, దేశ సంపద కొద్ది మంది చేతుల్లో కాకుండా ఉండాలని కోరుకుంటున్న పత్రిక అన్నారు. సామాజిక లక్ష్యంతో పని చేస్తుందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, కోవిడ్‌లాంటి పరిణామాలు సంభవించినప్పుడు బాధితులకు సాయమందించడం లోను, వారిని ఆదుకోవడంలోను ప్రజాశక్తి ముందుంటుందని వివరించారు. ప్రజాశక్తిని ఇంతగా ఆదరించి ఈ స్థాయిలోకి రావడానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. పోటీ ప్రపంచంలో నిలబడటం చాలా కష్టమని, నీతికి, నిజాయితీగా పని చేసే విలేకర్లు ఉండటం వల్లే ఈ స్థాయిలో పత్రిక ఉందని తెలిపారు. సభ ప్రారంభంలో జిల్లా మేనేజర్ సిహెచ్ రాము ప్రజాశక్తి ప్రస్థానం గురించి వివరించారు.

ప్రజాశక్తి పెంపుదలలోనూ, పత్రికను నడపడలోనూ కృషి చేస్తున్న ఏజెంట్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావును అతిథుల చేతుల మీదుగా సత్కరించారు. సభలో వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, ప్రజాశక్తి విలేకర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన రెడ్ క్రాస్ చైర్మన్ ప్రసాద్

ప్రజాశక్తి దినపత్రిక 45వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక జెడ్‌పి మినిస్టీరియల్ భవనంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రెడ్ క్రాస్ చైర్మన్ కెఆర్‌డి ప్రసాద్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కెఆర్‌డి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాశక్తి సామాజిక దృక్పథం కలిగిన పత్రిక అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వార్తల రూపంలో కృషి చేస్తూనే ఇటువంటి సామాజిక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ప్రతి ఏటా వివిధ రూపాల్లో సామాజిక కార్యక్రమాలు నిర్వహించి ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా ఉద్యోగులు,పాఠకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి కలెక్టర్ అంబేద్కర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కెఆర్‌డి ప్రసాద్

సమావేశంలో మాట్లాడుతున్న మెప్మామిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్

పైనాపిల్ పార్కుకు జిల్లా అనుకూలం

మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్

ప్రజాశక్తి - పార్వతీపురం

పైనాపిల్ పార్కుకు జిల్లా అనుకూలమని, ఆ దిశగా ఆలోచనలు చేయాలని మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ అధికారులను ఆదేశించారు. విదేశాల్లో పైనాపిల్‌కు మంచి గిరాకీ ఉందని, ఈ ప్రాంతంలో పైనాపిల్ దిగుబడి అధికంగా ఉన్నందున, పార్కు ఏర్పాటుకు ఎంతో అనుకూలంగా ఉంటుందని సూచించారు. యూనిట్ స్థాపనకు అవసరమైన శిక్షణను నిపుణులతో ఇప్పిస్తామని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మెప్మా అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ పేదరికం నుంచి మహిళలు బయటపడి, ఆర్థికంగా నిలదొక్కుకోవాలనేదే మెప్మా ఆశయమని, ఆ దిశగా కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టాలని అధికారులను కోరారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతతో పాటు చెత్త నుంచి సంపదను సృష్టిస్తున్నారని, వర్మీ కంపోస్టుకు మంచి గిరాకీ ఉన్నందున, ఇంటి వద్దనే వర్మీ కంపోస్టును తయారుచేసి విక్రయించవచ్చని అన్నారు. అలాగే టెర్రాస్ గార్డెన్ ద్వారా ఆకు, కూరగాయల ఫలసాయం చేసి లబ్దిని పొందే అవకాశం ఉన్నందున, వాటిపై అవగాహన కల్పించాలని తెలిపారు. డిజి- లక్ష్మీ పథకం కింద డిజిటల్ కియోస్కల స్థాపించి, 250 ప్రజా సేవలను ప్రజలకు అందించడం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చని, కావున కియోస్క్ యూనిట్ల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. ఇకపై మెప్మా కార్యకలాపాలన్ని యాప్ ద్వారానే జరగనున్నం దున, వాటి వినియోగం పట్ల అవగాహన పెంచుకోవాలని తెలిపారు. త్వరలో మెప్మా సాధించే విజయాలు, నిర్వహించే కార్యకలాపాలపై న్యూస్ లేటరును అందుబాటులోకి తీసుకువచ్చేలా ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మెప్మా పథక సంచాలకులు జివి చిట్టిరాజు, సాంకేతిక నిపుణులు, సిఎంఎంలు, సిఒలు, డిఇఒలు, సిఎల్ఆర్‌సిలు, టిఎల్ఎఫ్ ఆర్పీలు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవంలో భాగస్వాములు కండి : పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈ నెల 9న జరగనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో భాగస్వాములు కావాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ గిరిజన సంఘాల నాయకులను కోరారు. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, అందుకు తగిన సూచనలు చేయాలని అన్నారు. ఇది మనందరి కార్యక్రమమని, ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా జరిగేందుకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో గిరిజన సంఘాల నాయకులతో పిఒ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో గిరిజన లబ్ధిదారులకు ఉపకరణాలు, ఆర్థిక లబ్ది, వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. గిరిజన సంప్రదా యాన్ని, సంస్కృతిని ప్రతిబింబించేలా సాంస్కృతిక ప్రదర్శనలు, విలువిద్య పోటీలు, ఉపయోగించే సామాగ్రి వంటివి ప్రదర్శించేలా ఆదేశించామన్నారు.

గ్రూపు రాజకీయాలు సహించం

పాలకొండ నేతలకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా హెచ్చరిక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీలో వ్యక్తిగత స్వార్థం కోసం గ్రూపు రాజకీయాలు చేస్తే సహించేది లేదని, అటువంటి వారిపై అధినాయకత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని పాలకొండ నియోజకవర్గం టిడిపి నాయకులను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు హెచ్చరించారు. శుక్రవారం టిడిపి విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గం కార్యాలయంలో పాలకొండ నియోజకవర్గ నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి వ్యక్తిగత స్వార్థాలకు వేదిక కాదన్నారు. పార్టీ శ్రేయస్సే ప్రథమమని తెలిపారు. పాలకొండ నియోజవర్గ నేతల నిర్లక్ష్యంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదు, సుపరిపాలనలో తొలి అడుగు వంటి కార్యక్రమాల్లో పాలకొండ నేతలు నిర్లక్ష్యం వ్యవహరించారన్నారు. ఇకనైనా తీరుమార్చుకుని పార్టీ విధానాలను గౌరవిస్తూ, సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు, పాలకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో పార్టీ జోనల్ కో-ఆర్డినేటర్ దామచర్ల సత్య, పార్లమెంటరీ అధ్యక్షులు కిడారి శ్రావణ్ కుమార్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

దత్తత స్వచ్ఛందమే

ప్రజాశక్తి - పార్వతీపురం

పి4 దత్తత పూర్తిగా స్వచ్ఛందమేనని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. పి4, పిఎం సూర్య ఘర్, హర్ ఘర్ తిరంగా తదితర అంశాలపై శుక్రవారం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా వేడుకలను ఆగస్టు 15 వరకు ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఈ వేడుకల్లో భాగంగా త్రివర్ణ పతాకాలను గృహాలపైన పెట్టడం, పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించడం, సాంస్కృతిక కార్యక్రమాలను, ఛాయాచిత్ర ప్రదర్శనలు ఏర్పాటు చేయడం తద్వారా ప్రజల్లో దేశభక్తిని పెంపొందింపు చేయుటకు అన్ని చర్యలు చేపట్టాలని ఆయన వివరించారు పిఎం సూర్య ఘర్ కింద సౌర విద్యుత్తు ప్యానెల్ ఏర్పాటు చేయుటకు ఎస్సీ, ఎస్టీ గహాల పైన ఖాళీ స్థలం ఉంటే గుర్తించాలని అన్నారు. సౌర విద్యుత్తు ప్యానల్ ఏర్పాటు తర్వాత విద్యుత్తు కూడా ఉచితంగా పొందే అవకాశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నదాత సుఖీభవ పంపిణీ

పార్వతీపురం : జిల్లాలో అన్నదాత సుఖీభవ కింద రూ.84.58 కోట్లు రైతుల ఖాతాలో జమ కానుందని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ కార్యక్రమంపై శుక్రవారం వ్యవసాయ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 1,22,260 మంది రైతులు ఇ - పంట తదితర అన్ని అంశాలను పూర్తి చేసుకుని అర్హులుగా గుర్తించామన్నారు. ఈ రూ.84.58 కోట్లు రైతుల ఖాతాలో శనివారం జమ కానున్నాయి.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

- జిల్లాలో పీజీ సెంటర్లు ఏర్పాటు చేయాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ పావని
- కలెక్టరేట్ వద్ద విద్యార్థుల నిరవధిక నిరాహార దీక్షలు
- యుటిఎఫ్ మద్దతు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలైనా ఈనాటికీ డిగ్రీ తరగతులు ప్రారంభించకపోవడం అన్యాయమని, వెంటనే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ పావని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ మన్యం జిల్లా కమిటీ ఆధ్వర్యాన జిల్లా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరవధిక నిరాహార దీక్షలను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ పావని, జిల్లా కార్యదర్శి టి.అఖిల్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.సంధ్య, కె.డేవిడ్, సహాయ కార్యదర్శి ఎ.గంగారావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సురేష్, జీ.సంజీవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ డిగ్రీ తర్వాత పై చదువుల కోసం జిల్లాలో పీజీ కోర్సుల్లేవనీ, డిగ్రీ లేక, పీజీ లేక ఉన్నత చదువులకు ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. నూతన విద్యా విధానంలో భాగంగా హయ్యర్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ సరళమైన మార్పులు తీసుకొచ్చి డిగ్రీని రద్దు చేసే ప్రయత్నం చేపడుతుందని, అందులో భాగమే డిగ్రీ అడ్మిషన్లు చేపట్టకపోవడం, సెమిస్టర్, సింగిల్ సబ్జెక్ట్, ఇంటర్ షిప్ విధానాలను తీసుకొచ్చిందని తెలిపారు. విద్యారంగ విలువలను రద్దు చేసే ఎన్ఇపి విధానాన్ని ఆనాడు, ఈనాడు ఎస్ఎఫ్ఐ వ్యతిరేకిస్తూనే ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నా భిన్నం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నేటి కూటమి ప్రభుత్వం గగ్గోలు పెట్టి, నేడు అదే విధానాలను అనుసరిస్తుననదని చెప్పారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. గత దశాబ్ద కాలంగా ఒక విద్యాసంస్థను నెలకొల్పే పరిస్థితి లేదని, ఉన్న విద్యా సంస్థల చరిత్రను తారుమారు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

దీక్షలను ప్రారంభిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పావని

దీక్షలకు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ సంఘీభావం తెలుపుతూ జిల్లా ఏర్పడి నాలుగేళ్లు గడుస్తున్నా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో సుమారుగా 6 వేల మంది విద్యార్థులు ఉన్నారని, వీరి ఉన్నత చదువుల పరిస్థితి ఏమిటని ప్రభుత్వాన్ని నిలదీశారు. పైగా ప్రభుత్వం కుట్రపూరితంగా జీవో 77తో పీజీ విద్యార్థులకు చెల్లించే ఫీజు రియంబర్స్మెంటును రద్దు చేసిందని చెప్పారు. ఆశ్రమ పాఠశాలలో ఎఎన్ఎం సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు పిట్టల్లా రాలుతున్నా ప్రభుత్వంలో ఎటువంటి స్పందన లేదన్నారు. 117 జీవో స్థానంలో కొత్త జీవోలు తీసుకువచ్చి పాఠశాలలను మూసివేసే కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగా అభివద్ధికి ఎస్ఎఫ్ఐ చేస్తున్న పోరాటాలకు మద్దతుగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.అనిల్, టి.అఖిల్ మాట్లాడుతూ పార్వతీపురం, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం కేంద్రాల్లో పీజీ సెంట్రల్ ఏర్పాటు చేయాలని, పెండింగులో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ను వెంటనే విడుదల చేయాలని, ఆఫ లైన్ ద్వారా డిగ్రీ అడ్మిషన్ ప్రారంభించాలని, సింగిల్ మేజర్ సబ్జెక్ట్ స్థానంలో డ్యూయల్ మేజర్ సబ్జెక్ట్ విధానం అమలు చేయాలని, సాలూరు పీజీ సెంటర్లో ఎనలిటికల్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులను పెట్టాలని, జీవో 77ను రద్దు చేయాలని, వీరఘట్టం డిగ్రీ కాలేజీ సొంత భవనం పనుల ప్రారంభించాలని, కురుపాం కేంద్రంలో డిగ్రీ కళాశాల, పార్వతీపురంలో పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లకు అదనపు భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ నిరవధిక నిరాహార దీక్షలు మంగళవారం వరకు కొనసాగుతుతాయని, అదే రోజు పెద్ద ఎత్తున కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. కావున విద్యార్థులు, మేధావులు, అభ్యుదయవాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్దఎత్తున విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆందోళన జోరువానలో కొనసాగింది. రాత్రి అక్కడే వంటావార్పు చేసిన నిద్రించారు.

దీక్షా శిబిరం వద్ద నిద్రిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అద్దెబస్సు డ్రైవర్ల సమ్మె

సమస్యలు పరిష్కరించాలని సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని అద్దె బస్సు డ్రైవర్లకు వేతన ఒప్పందం చేయాలని కోరుతూ శుక్రవారం నుంచి విధులను డ్రైవర్లు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వై.మన్మధరావు, బివి రమణ మాట్లాడుతూ 2019 నుంచి నేటి వరకు వేతన సవరణ చేయకపోవడం సమంజసం కాదని తక్షణమే అద్దె బస్సు డ్రైవర్ల వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. రోజుకు 12 ,18 గంటలు విధులు నిర్వహిస్తున్నప్పటికీ అరకొర వేతనం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతన సవరణ చేయాలని ఇప్పటికే ఆర్టీసీ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు, కార్మిక శాఖ అధికారులకు తెలియజేసినప్పటికీ ఫలితం శూన్యమని అన్నారు. ఆర్టీసీ అధికారులు కార్మికులకు మేలు చేయకపోగా అద్దె బస్సు యజమానులకు మద్దతుగా మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. పార్వతీపురం ఆర్టీసీ డిపో అధికారులకు కార్మికుల సమస్యలు పరిష్కారానికి చిత్తశుద్ధి లేనందున సమ్మె చేయాల్సిన తప్పనిసరి పరిస్థితి కార్మికులకు వచ్చిందని చెప్పారు. ఇప్పటికైనా డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని, తొలగించిన వారిని విధులలోకి తీసుకోవాలని, వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఈ సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు.

కార్యక్రమంలో సిఐటియు నాయకులు రెడ్డి వేణు, గొర్లి వెంకటరమణ, బి సూరిబాబు, అద్దె బస్సు డ్రైవర్ల సంఘం నాయకులు వీరాచారి, దుర్గాప్రసాద్ ,మన్మధరావు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

డిపో వద్ద నిరసన తెలుపుతున్న అద్దెబస్సు డ్రైవర్లు, సిఐటియు నాయకులు

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, లేకుంటే ఉపేక్షించేది లేదని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ సంబంధిత అధికారులను హెచ్చరించారు. ఎప్పటికప్పుడు విద్యార్థులు బాగోగులు చూడాల్సిన బాధ్యత సంక్షేమ, వైద్యాధికారులపై ఉందన్నారు. ఇకపై ఇటువంటివి పునరావృతం కారాదని, సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. అయినప్పటికీ అనారోగ్యానికి గురైతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని పిఒ స్పష్టం చేశారు. మండలంలోని డోకిశీల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అనారోగ్యానికి గురైన నేపథ్యంలో శుక్రవారం ఆయన విద్యార్థులను పరామర్శిం చారు. వారి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకొని, విద్యార్థులకు ధైర్యం చెప్పారు. అనంతరం వసతి గృహ ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందితో సమీక్షించారు.



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఎన్ఎం, ఆశా వర్కర్లు విద్యార్థులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, అనుమానంగా ఉంటే రక్తపరీక్షలు నిర్వహించి, వ్యాధులను నిర్ధారించాలని వివరించారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటివి రాకుండా దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులకు ప్రామాణిక విద్య, నాణ్యమైన ఆహారం, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హితవు పలికారు. ఈ పర్యటనలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో మందుబాబులను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధ్యాయులే మందుబాబులుగా మారితే విద్యార్థుల పరిస్థితి ఏంటని, అటువంటి ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ శుక్రవారం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.అనిల్, టి.అఖిల్ మాట్లాడుతూ పార్వతీపురం మండలం డోకిశీల ఆశ్రమ పాఠశాలలో గత కొన్ని రోజులుగా ఇద్దరు ఉపాధ్యాయులు నిరంతరం మద్యం సేవిస్తున్నారని, దీనిపై విద్యార్థులు, మరి కొంత మంది ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నప్పటికీ వారిలో ఎలాంటి మార్పు లేదని అన్నారు. దీనివల్ల మానసికంగా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎటువంటి హెచ్చరికలను కూడా బేఖాతరు చేసిన ఈ ఉపాధ్యాయుల తీరు పట్ల కొంతమంది విద్యార్థుల మధ్య ఇబ్బందికర పరిస్థితి నెలకొంటుందని, దీనిపట్ల కొంతమంది విద్యార్థులు అనారోగ్య బారిన పడే పరిస్థితి ఉందని తెలిపారు. కావున వెంటనే జిల్లా కలెక్టర్ కలుగజేసుకొని ఆ ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో ఆందోళన చేపడతామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని బాలేసు పంచాయతీ బాలేసుగూడలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ గ్రామంలో మొత్తం 20 కుటుంబాలు ఉన్నాయని, తాగునీటి నిమిత్త 3వేల లీటర్ల ట్యాంక్, రెండు మంచినీటి బావులు ఉన్నాయని తెలిపారు. రక్షిత ట్యాంకును క్లోరినేషన్ చేసి గ్రామానికి తాగునీరు సరఫరా అందిస్తున్నామన్నారు. రూ. 11.90 లక్షలు జెజెఎం నిధులతో మంజూరయ్యే వాటర్ పనులను ప్రారంభించి ప్రజలకు మరింత పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బిడ్డిక కృష్ణారావు, సర్పంచ్ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - సీతానగరం

ఈ నెల 2న పార్వతీపురం జిల్లా కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య తలపెట్టిన నిరసన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య విజ్ఞప్తి చేసింది. స్థానిక ఎంఆర్‌సి వద్ద శుక్రవారం సమావేశమైన ఫ్యాప్టో నాయకులు చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు, పెండింగ్ ఆర్థిక బకాయిలను చెల్లించాలని పెండింగ్ డిఎలను మంజూరు చేయాలని విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో ఈ ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఫ్యాప్టో మన్యం జిల్లా అధ్యక్షులు పి. మూర్తి నాయుడు, యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. శ్రీనివాసరావు, బి. ప్రసాదరావు, ఎపిటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. సత్యనారాయణ, ఎస్.సత్యం నాయుడు పాల్గొన్నారు.

బిటి రహదారి పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దొర జమ్ము నుంచి బొడ్డగూడ గ్రామం వరకు ఎస్ఆర్ఇజిఎస్ నిధులు రూ. 1.10కోట్లతో, మూలిగూడ రోడ్డు జంక్షన్ నుంచి బాతుగూడ వరకు నాబార్డ్ నిధులు రూ.70 లక్షలతో నిర్మిస్తున్న బిటి రహదారులను పాలకొండ ఈఈ రవి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన బిటి రహదారి పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇ శ్రీనివాసరావు, మండల ఇంజనీరింగ్ అధికారి కోరా మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - భామిని

మండలంలోని లోవ గూడ, నల్లరాయి గూడలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరాలను డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి పరిశీలించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న లార్వ సర్వే జ్వర సర్వేలను పరిశీలించారు. వైద్య శిబిరంలో రోగులను ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడేలా చూడాలని, పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించాలని స్థానికులకు సూచించారు. నల్లరాయిగూడలో 52 మందికి, లోవగూడలో 109 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో భామిని పిహెచ్‌సి వైద్యులు పసుపులేటి సోయల్, బత్తిలి పిహెచ్‌సి వైద్యులు శివకుమార్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి గ్రామంలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు, చిన్నారు, తదితర రకాలైన రోగులకు పరీక్షలు ప్రత్యేక వైద్య చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : ఎస్‌పి

పార్వతీపురం టౌన్: జిల్లా పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ముఖ్య ప్రాధాన్యతను ఇస్తూ సిబ్బంది వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన పలు సమస్యలు పరిష్కరించడానికి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ గ్రీవెన్స్-డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొని వారికి సమస్యలను ఎస్పీ కి స్వయంగా తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి సత్వర పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో సిసి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

పాలకొండ: విద్యార్థులు సైబర్ నేరాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని శక్తి టీం ఎస్ఐ పి.సురేష్‌కుమార్ తెలిపారు. పాలకొండలోని వెంకంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో శక్తి టీం విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. చిన్నారుల భద్రత, హెల్ప్‌లైన్ నెం. 1972, ఈగల్, మహిళ రక్షణ తదితర వాటిని గురించి వివరించారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రాము, గణపతి, గణేష్‌బాబు, హెచ్‌ఎంలు వెంకటరమణ, భాస్కరరావు, పరాంకుశం నాయుడు, పుష్పనాధం తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయండి

మక్కువ: మండలంలోని ఎర్రసామంతవలస గిరిజన ఆశ్రమ పాఠశాలలో వెంటనే మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని శంబర పిహెచ్‌సి వైద్యాధికారిని ఎంపిడిఒ డిడి స్వరూప రాణి ఆదేశించారు. హాస్టల్ నోడల్ అధికారి డిడి స్వరూపారాణి శుక్రవారం ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. హాస్టల్ మోనిటరింగ్, వెల్ఫేర్‌లో భాగంగా హాస్టల్‌ను సందర్శించినట్లు తెలిపారు. సుమారు 365 మంది పిల్లల్లో కొంతమందికి వైరల్ ఫీవర్ లక్షణాలు కనిపించిన నేపథ్యంలో వైద్యాధికారులను అప్రమత్తం చేశామన్నారు. శాశ్వత ఎఎన్ఎం లేకపోయినా రెండు రోజులకు ఒకసారి రెగ్యులర్ వచ్చి చూస్తున్నారని సిబ్బంది ఆమెకు తెలిపారు. అనంతరం విద్యార్థుల భోజనాలు, వసతి, పరిశీలించారు. విద్యార్థులు వినియోగిస్తున్న మరుగుదొడ్లను పరిశీలించి 20 బాత్రూంలకు రిపేర్లు అవసరమని, అలాగే పాఠశాల ఆవరణకు 200 మీటర్ల ప్రహరీ గోడ అవసరమని గుర్తించామన్నారు.

హెచ్ఎంను సస్పెండ్ చేయాలి

పార్వతీపురం: కొమరాడ మండలం కెమిశీల గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్ఎంను తక్షణమే సస్పెండ్ చేయాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడుతూ స్వయంగా ఐటిడిఎ పిఒ పరిశీలనలో పాఠశాలలో పలు లోపాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. పాఠశాల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న హెచ్ఎంని సస్పెండ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్ల సురేష్, గిరిజన అభ్యుదయ సంఘం నాయకులు ఆరిక చంద్ర శేఖర్, ట్రైబల్ రైట్స్ ఫోరమ్ నాయకులు ఇంటికొప్పల రామకృష్ణ, రొబ్బ లోవరాజు, గిరిజన ఐక్య వేదిక నాయకులు బిడ్డిక తమ్మయ్య, ఆరిక ఎల్లయ్య కుమార్, సీదారపు రాజు, ఆదిమ జాతుల సంఘం, గిరిజన సేవా సంఘం నాయకులు మంచాల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలకు తల్లిపాలు తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

బిడ్డ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లి పాలు తప్పనిసరి అని జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు పేర్కొన్నారు. తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా వెంకంపేటలో శుక్రవారం బాలింతలు, గర్భిణీలకు నిర్వహించిన అవగాహన సదస్సులో తల్లి పాలు ప్రాముఖ్యతపై పలు సూచనలు చేశారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు తప్పనిసరిగా తాగించాలని, తల్లి ముర్రు పాలు బిడ్డకు మొదటి సహజ టీకా అని తెలిపారు. ఇందులో ఉండే ప్రోటీన్లు, ఫ్యాటీ యాసిడ్స్, లాక్టోజ్, విటమిన్లు, ఇమ్యూనోగ్లోబ్యులిన్స్ బిడ్డ సంపూర్ణ ఎదుగుదలకు, రోగనిరోధక వ్యవస్థ బలపడ్డానికి తోడ్పడతాయన్నారు. వ్యాధుల నుంచి రక్షణ కలిగిస్తాయన్నారు. బిడ్డకు పాలు పట్టే విధానం, జాగ్రత్తలు, చేతుల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ నెల 1 నుంచి 7 వరకు వివిధ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తల్లి, బిడ్డ ఆరోగ్య వివరాలపై తెలుసుకొని అక్కడ నిర్వహించిన సంచార చికిత్సా వైద్య తనిఖీల వివరాలపై పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, డెమో సన్యాసిరావు,సూపర్వైజర్స్ శ్రీరాములు నాయుడు,నాగమ్మ,వైద్య అంగన్వాడీ మరియు 104 సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం: అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న ఎన్‌సిడి పిఒ

కొమరాడ : పుట్టిన పసిపిల్లలకు తల్లిపాలుతోనే ఆరోగ్యం సాధ్యమని కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి జి.సుగుణ కుమారి అన్నారు. కొమరాడలోని అంగన్‌వాడీ-5వ కేంద్రంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పుట్టిన ప్రతి పిల్లలకు తల్లిపాలు తప్పనిసరిగా పట్టిస్తే వారు పూర్తిగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వ అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని సద్వినియం చేసుకోవాలని కోరారు. విక్రాంపురం సెక్టర్ పరిధిలో గల అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ బంగారమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు తల్లిపాలు విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, సెక్టార్ యూనియన్ నాయకులు ఎస్ అనురాధ, జ్యోతి, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గరుగుబిల్లి సెక్టార్ సూపర్వైజర్ రౌతు లక్ష్మి ఆధ్వర్యాన గొట్టివలస అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాలు వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలు ప్రాధాన్యతను లక్ష్మి వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు పెద్దింటి మీనాక్షి, పద్మావతి పాల్గొన్నారు.

పాచిపెంట : తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని సరాయివలస, గొలుగువలస అంగన్వాడి కేంద్రాల్లో బాలింతలు గర్భిణులకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో తల్లిపాలు ప్రాముఖ్యతపై సిడిపిఒ బి.అనంతలక్ష్మి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు రెడ్డి ఇందిరా, అంగన్వాడి కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి -కురుపాం

రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఎంపిడిఒ బివై నాగభూషణరావు ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పౌజ్ పెన్షన్లు పంపిణీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారమే సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, మండల కన్వీనర్ కెవి కొండయ్య, ఇఒపిఆర్‌డి వై.వెంకటనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పట్టణంలో కొత్తగా మంజూరైన 80 వితంతు పెన్షన్లను మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్‌తో కలిసి ఎమ్మెల్యే బి.విజయచంద్ర లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిఎస్ వెంకటేశ్వర్లు,కౌన్సిలర్స్, టిడిపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తగా 458 పింఛన్లు మంజూరు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కొత్తగా 458 సామజిక పింఛన్లను కూటమి ప్రభుత్వం మంజూరు చేసింది. గుమ్మలక్ష్మీపురం మండలం 71, గరుగుబిల్లి 100, జియమ్మ వలస 120, కొమరాడ 104, కురుపాం మండలం లో 63 పింఛన్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. ఆగష్టు నెల నుంచి పంపిణి చేస్తున్నట్లు తెలిపారు.

కురుపాం: పింఛను నగదు అందిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

వీరఘట్టం : మండలంలోని 24 సచివాలయాల పరిధిలో శుక్రవారం 8,429 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ తెలిపారు. 9,707 పింఛన్లు పంపిణీ చేయవలసి ఉండగా 8,429 మందికి అందించామన్నారు మిగిలినవి శనివారం పంపిణీ చేస్తామన్నారు.

సీతానగరం: మండలంలోని చినబోగిలి గ్రామంలో పింఛను పంపిణీని ఎంపిడిఒ ప్రసాద్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.కె.కుమార్ వర్మ, టిడిపి నాయకులు శంకరరావు, నడగాన వెంకయ్య, సబ్బాన జగనాదం తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని సంతోషపురం పంచాయతీ పరిధిలోని ఖడ్గవలసలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం సంతోషపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ అంబటి తవిటి నాయుడు (రాంబాబు) ఆధ్వర్యంలో జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఓ ప్రభాకర రావు, ఎంపిడిఒ జి.పైడితల్లి, మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు, నాయకులు మర్రాపు పురుషోత్తంనాయుడు, మరడాన తవిటి నాయుడు, అంబటి తవిటి నాయుడు (రాంబాబు), ద్వారపురెడ్డి సత్యనారాయణ (సత్తిబాబు), ఎంపిటిసి ప్రతినిధి యామల శ్రీనువాసరావు, మంత్ర బుడ్డి చంద్రశేఖరరావు, బంకురు శంకర్రావు, మంత్రబుడ్డి సింహాచలం నాయుడు, గొట్టాపు చిన్నంనాయుడు, బోను సత్యనారాయణ మాస్టారు, మండల తెలుగు యువత అధ్యక్షులు బొత్స జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కొటికి పెంట, పాంచాలి రెవెన్యూ పరిధిలో సాగు చేస్తున్న ప్రభుత్వ భూములకు సాగు పట్టాలు అందజేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక తహశీల్దార్ డి.రవికి కోడికాళ్లవలస, గరేళ్లవలస గ్రామాలకు చెందిన గిరిజన రైతులు సర్పంచ్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ కొటికిపెంట, పాంచాలి రెవెన్యూ పరిధిలో 210 సర్వే నెంబర్లో సాగు చేస్తున్న కొంత భూమి రెవెన్యూ భూమిగా రెవెన్యూ అధికారులు, అటవీ భూమిగా ఫారెస్ట్ అధికారులు గత 20 ఏళ్లుగా చెప్పుకొస్తూ సంబంధిత అధికారులు నిర్ధారించడం లేదన్నారు. దీంతో సంబంధిత సాగు రైతులు పట్టాలకు దూరమవుతున్నారని, ఇప్పటికైనా రెవెన్యూ, అటవీశాఖాధికారులు పలానా శాఖకు సంబంధించిన భూమిగా నిర్ధారించి సాగు పట్టాలు అందజేయాలని కోరారు.

దురిబిలి పరిసర ప్రాంతాల్లో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి -కురుపాం

మండలంలోని దురిబిలి గ్రామ పరిసర కొండల్లో గల జీడి, మామిడి తోటల్లో శుక్రవారం ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ గిరిజన ప్రజలు పోడు వ్యవసాయం నిమిత్తం కొండలపైకి వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉంటూ వెళ్లాలని సూచించారు. అలాగే పరిసర ప్రాంతాల ప్రజలు ఏనుగుల కదిలికలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఆ రహదారి వెంట ప్రయాణించాలని సూచిస్తున్నారు.

నేడు ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ వేడుకల్లో భాగంగా మండలంలోని లోవ ముఠా 10 పంచాయతీలకు గొరడ కేంద్రంగా శనివారం ఆదివాసీ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక చైర్మన్ కోలక లక్ష్మణమూర్తి తెలిపారు. ఉదయం 10 గంటలకు వైద్య శిబిరం, ఆ తర్వాత వేడుకలు ప్రారంభమవుతాయని అన్నారు. కావున గిరిజనులంతా ఈ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఒకే గ్రామంలో ముగ్గురు కానిస్టేబుళ్లుగా ఎంపిక

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ ఫలితాల్లో కొమరాడ మండలం మార్కొండపుట్టి గ్రామానికి చెందిన బొంగు మణికంఠ, పెనుగంటి గణేశ్, బోనెల గణేశ్ ఎపిఎస్‌పిలో కొలువులు సాధించారు. ఒకే గ్రామంలో ముగ్గురు యువకులు ఉద్యోగం సాధించడంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కల్లికోటలో తలగాపు వెంకటరమణ, గుమడలో పిట్ట సాయి, మాదలింగి, తోడుము గ్రామాల్లో కూడా ఒక్కొక్కరు ఉద్యోగానికి అర్హత సాధించారు. యువత వీరిని ఆదర్శంగా తీసుకొని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

గుమ్మలక్ష్మీపురం: పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో గుమ్మలక్ష్మీపురం మండలం గొరడకు చెందిన గిరిజన యువకుడు తాడంగి తరుణ్ ఎంపిక అయ్యాడు. విజయనగరం జిల్లాలో సివిల్ పోలీస్ కానిస్టేబుల్ జాబ్‌కు ఎంపికైనట్లు తెలిపారు. తరుణ్‌కు ఉద్యోగం రావడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు, స్నేహితులు అభినందనలు తెలిపారు. అలాగే జియమ్మ వలస మండలం లోతువానివలసకుకందుల విజయ్ కుమార్ సివిల్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక అయ్యాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

బలిజిపేట: మండలంలోని అరసాడకు చెందిన మరాడన ఈశ్వరరావు ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈశ్వరరావుకు ఎపిఎస్‌సి కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన పట్ల అరసాడ గ్రామ పెద్దలు యువకులు అభినందనలు తెలిపారు.

సాలూరు రూరల్ : మండలంలోని దత్తివలసకు చెందిన గిరిజన విద్యార్థి బొమ్మి పార్థసారథి విజయనగరం జిల్లాలో సివిల్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈయన తండ్రి ఉపాధ్యాయుడిగా పని చేస్తూ గత నెలలోనే రిటైర్మెంట్ అయ్యారు. తల్లి బొమ్మి బంగారమ్మ అదే గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తూ ఏడాది క్రితం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. పార్థసారథికి గిరిజనులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

వీరఘట్టం : మండలానికి చెందిన ఐదుగురు ఎపిఎస్‌పి పోలీస్ కానిస్టేబుల్‌కు ఎంపిక అయ్యారు. వీరిలో వీరఘట్టంకు చెందిన డి.నారాయణరావు, కిమ్మికి చెందిన ముదిలి భుజంగరావు, డిపి వలసకు చెందిన ముగడ శివ, కంచిశివ, దువ్వ దుర్గారావు ఎంపికయ్యారు. వీరు ఎంపిక పట్ల తల్లిదండ్రులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గరుగుబిల్లి : మండలంలోని చిలకాం గ్రామానికి చెందిన గుల్ల మృత్యుంజయరావు కానిస్టేబుల్ ఫలితాల్లో నాలుగవ స్థానం సాధించి ఉద్యోగాన్ని సంపాదించుకున్నారు. గ్రామస్తులు, బంధువులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వం స్పందించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి మొదటి సంతకం మేరకు గతంలో పనిచేసిన ఆదివాసీ ఆరోగ్యం సిబ్బందిని విధుల్లోకి తీసికోవాలని పలువురు గిరిజన, విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్వతీపురం గిరిజన సామజిక భవనంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్వతీపురం ఐటిడిఎ నిధులు దారిమళ్ళించారని, ఆ డబ్బుతో వైద్య సిబ్బందిని నియమించవచ్చని తెలిపారు. గిరిజన అని పేరు చెప్పి, మంత్రులు, ఉప ముఖ్య మంత్రులైన వారు గిరిజన విద్యార్థుల ప్రాణాలు కాపాడ్డానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కనీసం పరిహారం కూడా ఇవ్వడం లేదన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహల్లో సరిపడా వంట, బోధనేతర సిబ్బంది లేక పూర్తి స్థాయిలో మెనూ అమలు జరగడం లేదని తెలిపారు. అధికారుల పర్యవేక్షణ సక్రమంగా చేయడం లేదన్నారు. గిరిజన విద్యార్థులు మరణిస్తున్నా ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం గా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు తాడంగి సాయిబాబు, గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్లా సురేష్, గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్, ట్రైబల్ రైట్స్ ఫోరమ్ అధ్యక్షులు ఇంటికొప్పల రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు వంగల దాలి నాయుడు, పిడిఎస్ఒ నాయకులు సోమేశ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు బుజ్జి, లిబరేషన్ పార్టీ నాయకులు పి. సంగం, పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు శ్రీహరి, ఆదివాసీ సంఘం నాయకులు జగదీష్, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు గణేష్, పకిరు, ప్రజా సంకల్ప వేదిక నాయకులు కపాకర్, న్యాయవాది వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపు ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

విద్యుత్ ఛార్జీల పెంపులను ఆపాలని, ప్రమాదకరమైన స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 5న జిల్లా కలెక్టరేట్‌కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. సిపిఎం, ఎపి గిరిజన సంఘం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొమరాడలో విద్యుత్ వినియోగదారులకు వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని, విద్యుత్ ఛార్జీలు పెంచే పరిస్థితులు ఉండవని కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసిందని, అలాగే స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని పిలుపునిచ్చిన మంత్రి నారా లోకేష్ నేడు విద్యుత్ బిల్లులను భారీగా పెంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యుత్‌ఛార్జీల పెంపు, స్మార్ట్‌మీటర్ల బిగింపై శుక్రవారం నుంచి ఈనెల 4వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రచారం చూస్తామని, అనంతరం 5న కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహస్తామన్నారు. కావున ఈ ధర్నాకు విద్యుత్ వినియోగదారులంతా పెద్ద ఎత్తున కదిలి ప్రభుత్వానికి ఒక హెచ్చరిక ఇచ్చేలా నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో ం నాయకులు సిహెచ్ లక్ష్మయ్య, శివుని నాయుడు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ క్లినిక్‌లపై కొరడా

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని పలు ప్రైవేట్ క్లినిక్స్‌పై అధికార యంత్రాంగం కొరడా ఝులిపించింది. పట్టణంలో మూడు ప్రైవేట్ క్లినిక్‌లపై తహశీల్దార్ రాధాకృష్ణ మూర్తి, వైద్యాధికారి శివశంకర్ పోలీసులు కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. లైసెన్సులు ఉన్నాయా లేవా అన్న వివరాలను సేకరించారు. క్వాలిఫైడ్ వైద్యులు అక్కడ వైద్యసేవలు అందిస్తున్నారా లేదా కూడా పరిశీలించారు. చట్ట విరుద్ధంగా క్లినికల్ నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందిరానగర్ కాలనీ ఎదురుగా ఉన్న క్లినిక్‌తో పాటు ఎంకె రాజపురం దగ్గర ఉన్న క్లినిక్ కూడా ఎటువంటి అనుమతుల్లేవని గుర్తించి క్లినిక్‌లు మూసివేయాలని హెచ్చరించారు.

సీతంపేట : మండలంలోని ప్రయివేటు క్లినిక్‌లను, ల్యాబ్‌లను ఇంచార్జ్ తహశీల్దార్ మల్లేశ్వరరావు శుక్రవారం తనిఖీ చేశారు. మండల కేంద్రంలో ఉన్న జైభారత్ క్లినిక్‌తో పాటు మరో ఐదు క్లినిక్‌లను తనిఖీ చేశారు. క్లినిక్‌లకు సంబంధించి ధ్రువపత్రాలు, మెడిసిన్స్ పరిశీలించారు. రోగులకు సంబంధించిన వసతులు, ల్యాబ్ పరిస్థితి వచ్చిన రోగులు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్‌తో పాటు ఎస్ఐ వై.అమ్మనరావు, వైద్యాధికారి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు

కురుపాం: మండల కేంద్రంలోని ఆర్ఎంపి, పిఎంపి ఆస్పత్రులను మండల తనిఖీ బృందం శుక్రవారం మరోసారి తనిఖీ నిర్వహించింది. దుకాణాల్లో అనాధికారంగా ఉన్న మందులు స్వాధీనం చేసుకున్నారు. మొండెంఖల్ వైద్యధికారి డాక్టర్ ప్రజ్ఞ, తహశీల్దార్ కె.జయ, కురుపాం ఎస్ఐ నారాయణరావు, రెవెన్యూ సిబ్బంది బృందంగా ఏర్పడి ముమ్మర తనిఖీలు చేపట్టారు. పరిమిత వైద్యంకు మించి మాత్రలు ఉండటంతో స్వాధీనం చేసుకున్నారు.

మేడపై నుంచి పడి వికలాంగుడు మృతి

సాలూరు: పట్టణ పరిధిలోని పిఎన్ బొడ్డువలసలో మేడపై నుంచి జారిపడి వికలాంగుడు బండి మనోజ్ (25) మృతి చెందాడు. తన ఇంటి మేడ మీద ఎండబెట్టిన వడియాలను శుక్రవారం తీసుకుని రావడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ కిందకు జారిపడ్డారు. ఈ సంఘటనలో మనోజ్ చెవి నుండి రక్తం రాడం, తలకి బలమైన గాయం కావడంతో మృతి చెందాడు. ఈ సంఘటనపై టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

772 లీటర్ల సారా ధ్వంసం

పార్వతీపురం టౌన్: పట్టణ పోలీస్ స్టేషన్‌లో నమోదైన 17 నాటు సారా కేసుల్లో పట్టుబడిన 772.2 లీటర్లు నాటు సారాను, పట్టణంలో కొత్తవలస శివారులో ఉన్న నవిరి కాలనీ ప్రాంతంలో జిల్లా ఎఎస్‌పి అంకిత సురాన, ఎక్సైజ్ డిప్యూటీ సూపరింటెండెంట్ సంతోష్ కుమార్, పట్టణ సిఐ, కె. మురళీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ ఎస్ఐ ఎం.గోవింద, పోలీస్ సిబ్బంది, ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో ధ్వంసం చేశారు.

కురుపాం: 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని శుక్రవారం ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు నీలకంఠాపురం ఎస్సై నీలకంఠరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొండెంఖల్‌లో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్న సమయంలో నాటుసారా అమ్ముతుండగా పట్టుకొని అతనిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే కొత్త వ్యక్తుల రాకపోకలు గూర్చి గ్రామస్తుల దగ్గర వివరాలు సేకరించి ప్రజలకు సైబర్ క్రైమ్ నేరాలు, రహదారి భద్రత నియమాలపై పలు సూచనలు, సలహాలు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ పార్టీ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బొలెరో ఢీకొని వ్యక్తికి గాయాలు

గరుగుబిల్లి: మండలంలోని పరిధిలోని ఎర్రన్న గుడి జంక్షన్ వద్ద శుక్రవారం బొలెరో వాహనం టివిఎస్ ఎక్సెల్‌ను ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయని స్థానిక ఎస్ఐ పి.రమేష్ నాయుడు తెలిపారు. మండలంలోని దళాయివలస పంచాయతీ పరిధిలోని శివరాంపురం గ్రామానికి చెందిన పి లక్ష్మణ టివిఎస్ వాహనంతో వెళుతుండగా పార్వతీపురం నుంచి వీరఘట్టం వైపు వెళుతున్న బొలెరో వాహనం మండల పరిధిలోని ఎర్రన్నగుడి జంక్షన్ వద్ద వెనుక నుంచి ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన లక్ష్మణను పార్వతీపురం జిల్లా కేంద్రం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వసతిగృహ సందర్శన

ప్రజాశక్తి- పాచిపెంట

స్థానిక బిసి సంక్షేమ వసతి గృహంలో కేవలం ఎనిమిది మంది విద్యార్థులే ఉన్నారని తెలుసుకుని శుక్రవారం మండల ప్రత్యేకాధికారి పి. రాధాకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 100 నుంచి 150 మంది విద్యార్థులతో ఉండాల్సిన బీసీ హాస్టల్‌లో ఎనిమిది మంది విద్యార్థులు ఉండడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. 14 మంది విద్యార్థులు రిజిస్టర్ ప్రకారం ఉండాల్సి ఉండగా వివిధ కారణాల వల్ల ఆరుగురు విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. దీంతో 8 మంది విద్యార్థులకు వసతి గృహం పరిమిత మయ్యింది. గైరాజరైన విద్యార్థులు పాఠశాలకు వెళున్నారా లేదా ఇంటి దగ్గరే ఉన్నారా తెలుసుకోవలసిన బాధ్యత మీపై ఉందని అధికారులను ఆయన ప్రశ్నించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వసతి గృహానికి వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 8 మంది విద్యార్థుల కోసం ప్రభుత్వానికి లక్షల రూపాయలు ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఈ తనిఖీల్లో ఎంపిడిఒ బివిజె పాత్రో, ఇఒపిఆర్‌డి పి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



వివరాలను ఆరా తీస్తున్న ప్రత్యేకాధికారి రాధాకృష్ణ

రామచంద్రరావుకు పరామర్శ

ప్రజాశక్తి- సాలూరు రూరల్

కార్మిక ఉద్యమానికి విశేష సేవలందించిన ఎఐటియుసి నాయకులు సిద్దాబత్తుల రామచంద్రరావును వ్యవసాయ కార్మిక సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షులు జి శ్రీనివాస్ శుక్రవారం పరామర్శించారు. రామచంద్రరావు పక్షవాతంతో బాధపడుతుండడంతో శ్రీనివాస్ అతని ఇంటికి పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సాలూరులో కార్మిక ఉద్యమానికి విశేష కృషి చేసిన నేతల్లో బొర్రా చిన్న తర్వాత టక్కున గుర్తొచ్చే నేత రామచంద్రరావు అని, ఆయనతో 2005నుండి 2018 వరకు అనుబంధం ఉందని గుర్తు చేశారు. సాలూరులో సిఐటియు నాయకుడిగా పనిచేసిన సందర్భంగా ఉమ్మడి పోరాటాలు చేశామని, చాలా సందర్భాల్లో పోరాటాలు చేసే సమయంలో అనేక ఒడిదుడుకులకు గురైన వారికి ఆయన ధైర్యం చెప్పి పూర్తిగా నిలబడే వారని గుర్తు చేశారు. ఆయనతో పాటు సాలూరు సిఐటియు నాయకులు ఎన్ వై నాయుడు ఉన్నారు.

రామచంద్రరావును పరామర్శిస్తున్న శ్రీనివాస్

గుచ్చిమిలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గుచ్చిమిలో శుక్రవారం బాబు షూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించారు. స్తానిక సర్పంచ్ మర్రాపు శ్రీదేవి, సీనియర్ నాయకులు ధనుంజయల అధ్యక్షతన ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం 14నెలల పాలనలో సూపర్ సిక్స్ హామీలపై ఆరా తీశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ఇంటింటికి వంచన చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, స్థానిక సర్పంచ్ మర్రాపు ధనుంజయ్, ఎంపిటీసీ చల్లారపు జగదీష్, మండల వైసిపి ఉపాధ్యక్షులు బుడితి గౌరీ నాయుడు, రాష్ట్ర అనుబంధ విభాగాల ప్రధాన కార్యదర్శులు నడిమింటి రామకృష్ణ, జిల్లా వైసిపి కార్యదర్శులు బంకూరి శంకరరావు, పోల ఈశ్వరనారాయణ వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చంద్రబాబు మోసాలపై ప్రచారం చేస్తున్న జోగారావు